# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

**ప్రాంతీయ వార్తలు**

**తేది : 30-11-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **'ఫెంగల్' తుపాను నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ఆదేశించారు.**
2. **ఫెంగల్ తుపాను ప్రభావంతో రాష్ట్రంలోని దక్షిణ కోస్తా జిల్లాలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి.**
3. **పత్తి రైతులకు ఉపయోగపడేలా గుంటూరు టెక్స్ టైల్ పార్క్‌ను అభివృద్ధి చేయనున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.**
4. **అనంతపురం జిల్లాలో ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ఈ మధ్యాహ్నం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు.**
5. **విజయనగరం జిల్లాలో ఈరోజు ఉదయం జరిగిన రహదారి ప్రమాద ఘటనలో నలుగురు మృతి చెందారు.**

==========================

'ఫెంగల్' తుపానుపై ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తీసుకోవలసిన ముందస్తు చర్యలపై విపత్తు నిర్వహణ శాఖ, కలెక్టర్లు, రియల్ టైం గవర్నెన్స్ అధికారులతో చర్చించారు. అన్ని స్థాయిల్లో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేసి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

--------------------------

ఫెంగల్ తుపాను ప్రభావంతో రాష్ట్రంలోని దక్షిణ కోస్తా జిల్లాలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. తిరుపతి జిల్లాలో భారీ వర్షం పడుతోంది. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. ప్రజలు సహాయం కోసం తిరుపతి కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నెంబర్ 0877-2236007ను సంప్రదించవచ్చని చెప్పారు. తిరుమలలోనూ ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తున్న క్రమంలో భక్తులు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని టిటిడి సూచించింది. పాపవినాశనం, శ్రీవారి పాదాల మార్గాలను తాత్కాలికంగా మూసివేసినట్లు అధికారులు తెలిపారు.

మరో వైపు తుపాను ప్రభావంతో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి.జిల్లాలోని నెల్లూరు, వెంకటాచలం, కోవూరు.,.ముత్తుకూరు, పొదలకూరు మండలాల్లో వర్షం

కురుస్తోందని ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ తెలిపారు. ప్రజలకు సహాయక చర్యలు అందించేందుకు మూడు విపత్తు నిర్వహణ దళాలు జిల్లాకు చేరుకున్నాయని చెప్పారు

---------------------------

పత్తి రైతులకు ఉపయోగపడేలా గుంటూరు టెక్స్ టైల్ పార్క్‌ను అభివృద్ధి చేయనున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలంలోని గుంటూరు టెక్స్ టైల్ పార్క్ ను కేంద్రమంత్రి ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, టెక్స్ టైల్ పార్క్ అభివృద్ధికి నాణ్యమైన విత్తనాల సరఫరా వంటి సమస్యలను త్వరగా పరిష్కరిస్తామన్నారు. టెక్స్ టైల్ పరిశ్రమల నిర్వాహకులకు కేంద్ర ప్రభుత్వం నుండి 50 శాతం రాయితీ వచ్చేలా కృషి చేస్తామని కేంద్రమంత్రి వివరించారు.

---------------------------

ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. ఎ న్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా ప్రకాశం జిల్లా కొండెపి మండలం నెన్నూరుపాడు గ్రామంలోని లబ్దిదారులకు మంత్రి ఈ రోజు పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,

వాయిస్ ( 25 సెకన్లు)

---------------------------

విజయనగరం జిల్లా భోగాపురం జాతీయ రహదారిపై పోలిపల్లి వద్ద ఈ రోజు ఉదయం జరిగిన రహదారి ప్రమాద ఘటనలో నలుగురు మృతి చెందారు. శ్రీకాకుళం నుంచి విశాఖ వెళ్తుండగా పోలిపల్లి సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద కారు అదుపు తప్పి ఎదురుగా వస్తున్న లారీ బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని పోలీసు అధికారులు చెప్పారు. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఒక మహిళ, మరో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారని, మృతులంతా శ్రీకాకుళం పట్టణానికి చెందినవారిగా గుర్తించామని తెలిపారు.

---------------------------

ప్రజల సంక్షేమం కోసం ఎన్డీయే కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి అన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలోని రాయుడు కాలనీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో మంత్రి ఈరోజు పాల్గొని లబ్ధిదారులకు నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తున్నామని అన్నారు. సంక్షేమంతో పాటు, అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొంటూ,

వాయిస్ (31 సెకన్లు)

---------------------------

అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం, నేమకల్లు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పాల్గొంటారని అనంతపురం శాసన సభ్యులు డి. వేంకటేశ్వర ప్రసాద్ తెలిపారు. అనంతరం అదే గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక కార్యక్రమంలో

గ్రామస్తులతో ముఖ్యమంత్రి ముఖాముఖి నిర్వహిస్తారని తెలిపారు. డిసెంబర్ 1వ తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందే పింఛన్ల పంపిణీని ప్రభుత్వం నిర్వహిస్తోందని ఆయన అన్నారు.

---------------------------

డీఎస్సీ పరీక్ష రాసే అభ్యర్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఉచిత శిక్షణను అందిస్తోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో డీఎస్సీ శిక్షణా కేంద్రాన్ని మంత్రి ఈ రోజు సందర్శించి శిక్షణ గురించి అభ్యర్థులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల ఉచిత శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసిందని, పాలకొల్లు నియోజకవర్గ పరిధిలో శిక్షణ కోసం 800 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు.

---------------------------

హెచ్ఐవీ, ఎయిడ్స్ పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయని చీరాల డీఎస్పీ మొహమ్మద్ మోయిన్ తెలిపారు. రేపు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఈరోజు చీరాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ,

వాయిస్ (27 సెకన్లు)

---------------------------

తిరుమల పవిత్రతను, ఆధ్యాత్మిక ప్రశాంత వాతావరణాన్ని కాపాడేందుకు తిరుమలలో రాజకీయ, ద్వేషపూరిత ప్రసంగాలను నిషేధిస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం –టిటిడి ఈరోజు ఒక ప్రకటనలో తెలిపింది. తిరుమలలో గత కొంతకాలంగా శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దర్శనార్థం వచ్చే వారు దర్శనానంతరం రాజకీయ ప్రసంగాలు, విమర్శలు చేస్తున్నారని, దీంతో తిరుమలలో ఆధ్యాత్మిక వాతావరణానికి ఆటంకం కలుగుతోందని తెలిపింది. ఈ క్రమంలో రాజకీయ ప్రసంగాలను నిషేధిస్తున్నామని, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని టీటీడీ తెలిపింది.

---------------------------

రాష్ట్రంలో నిర్మిస్తున్న రైల్వే ప్రాజెక్టులు, జాతీయ రహదారుల పనులకు సంబంధించి భూసేకరణ, అటవీ, ఇతర అనుమతులు, అవసరమైన మౌలిక వసతుల కల్పన వంటి అంశాలకు రెండు వేర్వేరు టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటుచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి నేతృత్వంలో ఈ రెండు కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ నుంచి విద్యార్థులు, వృత్తినిపుణులు అధికంగా విదేశాలకు వెళ్తున్నందున అమరావతి, విశాఖపట్నంలో వీసా దరఖాస్తు కేంద్రాలను ఏర్పాటు చేయాలని విజయనగరం పార్లమెంట్ సభ్యులు కె. అప్పలనాయుడు విదేశాంగ మంత్రి జైశంకర్‌ను కోరారు. ఈ మేరకు నిన్న ఢిల్లీలో కేంద్రమంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఉన్నతవిద్య కోసం విదేశాలకు వెళ్లే భారతీయ విద్యార్థుల్లో ఆంధ్రప్రదేశ్ వాటా 22 శాతంగా ఉందని చెప్పారు. రాష్ట్రం నుంచి వీసాలకు ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా వీసా దరఖాస్తు కేంద్రాల ఏర్పాటును పరిశీలించాలని కేంద్రమంత్రిని కోరారు. గల్ఫ్ దేశాల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కార్మికులను తీసుకువచ్చేందుకు భారతీయ రాయబార కార్యాలయాల ద్వారా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు.

======================